



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి మంగళవారం 2-06-2026 సంపుటి: 02 సంచిక : 32 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday, 2-06-2026 Volume :02 Issue: 32 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





## ఆదిలాబాద్ అభివృద్ధికి
# కట్టుబడి ఉన్నాం

### ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం




- నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్
- మహా సిఎంకు తెలంగాణ అంటే చిన్నచూపు
- తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
- జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్

**ఆదిలాబాద్**

ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం.

-మిగతా 2 లో





## పశ్చిమాసియాలో
# మళ్లీ దాడులు

- పరస్పర ఆరోపణలతో వేడెక్కుతున్న వాతావరణం

**న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'ఆత్మరక్షణ' పేరుతో ఇరాన్ రాడార్, కమాండ్ కంట్రోల్ కేంద్రాలపై అమెరికా దాడులు చేసింది. అంతర్జాతీయ జలాలలో పనిచేస్తున్న ఎంక్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని, టెహ్రాన్ దుందుడుకు చర్యలకు ప్రతిగానే ఈ దాడులు చేశానని అమెరికా సమర్థించుకుంది. 'ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను, గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌ను, రెండు డ్రోన్లను అమెరికా యుద్ధ విమానం ధ్వంసం చేసింది' అని సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇదిలావుండగా ఇరాన్‌లోని సిరిక్ దీవిలో ఉన్న టెలీకమ్యూనికేషన్ టవర్‌పై దాడి చేసేందుకు ఉపయోగించిన అమెరికా వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలియజేసింది.

-మిగతా 2 లో





# నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు

**హైదరాబాద్,**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు.

-మిగతా 32 లో



## దోమలతో గూగుల్
# వినూత్న ప్రయోగం..

- అమెరికాలో 6.4 కోట్ల బయో దోమలు రిలీజ్
- దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ వినూత్న ప్రాజెక్టు

**న్యూయార్క్:**

గూగుల్ సంస్థ ఓ వినూత్న ప్రయోగానికి తెరలేపింది. దోమల( ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ సంస్థ పూనుకున్నది . దీనిలో భాగంగా ప్రయోగశాల్లో అభివృద్ధి చేసిన సుమారు 6.4 కోట్ల బయో దోమలను అమెరికాలో రిలీజ్ చేయనున్నది. తొలుత ఈ ప్రాజెక్టును ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో చేపట్టనున్నది. దీని కోసం ప్రభుత్వం అనుమతి కోరింది గూగుల్ సంస్థ. అసలైన దోమల జనాభాను నియంత్రించే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. వ్యాధికారక దోమల జనాభాను తగ్గించనున్నారు. గూగుల్ ప్లానింగ్‌కు చెందిన అంశం ప్రస్తుతం యూఎన్ పర్యావరణ పరిరక్షణ సంస్థ(ఈపీఏ) ఆధీనంలో ఉన్నది. రాబోయే

-మిగతా 2 లో

## పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

- నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ



2 లో

# ధూమపానంలో..చైనా టాప్

### ఏడాదికి ప్రపంచంలో సగటున 5 ట్రిలియన్ల సిగరెట్ల అమ్మకం

- అందులో 2.4 ట్రిలియన్ల సిగరెట్లు కాల్చేస్తున్న చైనీయులు
- అంకెల్లేకుండా పెరిగిపోతున్న సిగరెట్ రాయుళ్లు

ప్రపంచవ్యాప్తంగా ధూమపానం అలవాటుపై అవగాహన పెరుగుతుండటంతో సిగరెట్ల వినియోగం రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. కానీ మన పొరుగు దేశమైన చైనాలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా, అత్యంత భయానకంగా మారుతోంది. బీజింగ్ నుంచి తాజాగా విడుదలైన అధికారిక నివేదిక ప్రకారం.. ప్రపంచంలోనే అత్యధికంగా సిగరెట్లు తాగే దేశంగా చైనా అగ్రస్థానంలో నిలిచింది. చైనా జనాభాలో ప్రతి వంద మందిలో 23 మంది చొప్పున (అంటే దాదాపు 23 శాతం మంది) సిగరెట్లకు బానిసలయ్యారు. చైనా మొత్తం జనాభా సుమారు 140 కోట్లు కాగా.. ఇందులో దాదాపు 30 కోట్ల మంది చైనీయులు నిత్యం పొగ తాగుతూ తమ ఊపిరితిత్తులను గుల్ల చేసుకుంటున్నారు.

2 లో



## దేశభక్తి సినిమాలో
# చూపించడం కాదు..

### నిజజీవితంలో చూపించు పవన్ కళ్యాణ్



పవన్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

- ఆ తరువాతనే నవ నిర్మాణ సభ పెట్టుకోవాలి
- తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడితే సహించం
- ఆయన బీజేపీ ఎజెండా మోయడం శోచనీయం
- హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట,**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని

-మిగతా 2 లో



## ఎల్పీజీ ధరల మోత

- వాణిజ్య సిలిండర్‌పై రూ.42 పెంపు
- ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్‌పై రూ.11 వడ్డన
- దేశ ప్రజలకు మోడీ సర్కారు మరో షాక్

**న్యూఢిల్లీ**

కేంద్రంలోని మోడీ సర్కారు ఒకటో తారీఖున దేశ ప్రజలకు మరోసారి షాకిచ్చింది. దేశంలో ఎల్పీజీ ధరలు మళ్లీ పెంచింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.42 పెంచింది. దీంతో ఢిల్లీలో ఒక సిలిండర్ ధర రూ.3,113.50కు చేరింది. అలాగే ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ సిలిండర్‌పై కూడా రూ.11 పెరిగి.. ధర రూ.821.50కు ఎగబాకింది. పెరిగిన ధరల ప్రభావాన్ని వ్యాపార సంస్థలు, చిన్న హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు,

-మిగతా 2 లో

## ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం

- ప్రతికూల శక్తుల నుంచి ?రాష్ట్రాన్ని కాపాడుకోవాలి :
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్ష లు



**హైదరాబాద్**

రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను ఆయన స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ మేరకు కేసీఆర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో,

-మిగతా 2 లో

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు



- పేచీ కేవలం అక్కడి నాయకులతోనే
- ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం
- పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక

**హైదరాబాద్**

ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య

-మిగతా 2 లో

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ 'నీట్-కు సుప్రీం నో !

- సెలవుల తర్వాత విచారిద్దామంటూ వాయిదా




**న్యూఢిల్లీ**

ప్రస్తుతమున్న పెన్ను -- పేపర్ తరహాలో బదులుగా కంప్యూటర్ బేస్డ్ తరహాలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించేలా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను ఆదేశించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఈ దశలో పరీక్ష నిర్వహణా తీరును మార్చడం వల్ల ఆచరణాత్మక ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాఖ్యానించింది. పేపర్ లీకయిందనే ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన

-మిగతా 2 లో

# ధూమపానంలో..చైనా టాప్

సగానికి సగం చైనీయులే..

షాకింగ్ విషయమేమిటంటే.. ప్రపంచవ్యాప్తంగా ఒక ఏడాదిలో సగటున 5 ట్రిలియన్ల సిగరెట్లు అమ్ముడవుతుంటే.. అందులో సగానికి సగం అంటే ఏకంగా 2.4 ట్రిలియన్ల సిగరెట్లను కేవలం చైనా ప్రజలే తాగేస్తున్నారు. 2003 నుంచి 2023 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా సిగరెట్ల వినియోగం 26 శాతం తగ్గితే.. అదే సమయంలో చైనాలో మాత్రం ఈ వినియోగం ఏకంగా 39 శాతం పెరగడం అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ధూమపానానికి వ్యతిరేకంగా ఎంత పెద్ద యుద్ధం ప్రకటించినా, చైనాలో పొగ సెగలు మాత్రం అస్సలు తగ్గడం లేదు. సిగరెట్ల వినియోగాన్ని తగ్గించడానికి 2022 లో జిన్‌పింగ్ ప్రభుత్వం సిగరెట్లపై అదనంగా 10 శాతం పన్ను విధించడమే కాకుండా, యువతను ఆకర్షిస్తున్న ఈ-సిగరెట్ల పై కూడా కఠినమైన



నిషేధ ఆంక్షలు విధించింది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ చట్టాలు సరిగ్గా అమలు కాకపోవడంతో ఫలితం శూన్యంగా మారింది.

చచ్చ ప్రభుత్వ ద్వంద్వ నీతితోనే..

డ్రాగన్ దేశంలో ఇన్ని చట్టాలు ఉన్నా సిగరెట్ల వినియోగం తగ్గకపోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రభుత్వ ద్వంద్వ నీతి, భారీ వ్యాపార ప్రయోజనాలేనని నిపుణులు చెప్తున్నారు. చైనాలో సిగరెట్ల ఉత్పత్తి, అమ్మకాల మొత్తం వ్యవహారాలను ప్రభుత్వ అధీనంలోని 'చైనా నేషనల్ టొబాకో కార్పొరేషన్' అనే ఒకే ఒక్క సంస్థ చూసుకుంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పొగాకు కంపెనీ అయిన దీని లాభాలు వింటే ఎవరికైనా మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. కేవలం 2025 ఆర్థిక సంవత్సరంలోనే ఈ కంపెనీ ఏకంగా 244 బిలియన్ డాలర్ల నికర లాభాన్ని ఆర్జించింది.

ఈ కంపెనీ ద్వారా వచ్చే ఆదాయం చైనా ప్రభుత్వ మొత్తం వార్షిక ఆదాయంలో ఏకంగా 7 శాతంగా ఉంది. కరోనా మహమ్మారి సంక్షోభం తర్వాత చైనా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పుడు, దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి ఇదే పొగాకు కంపెనీని చైనా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. ఒకవైపు ప్రజల ఆరోగ్యం కోసం పొగ తాగొద్దని చెప్తూనే.. మరోవైపు ప్రభుత్వ ఖజానా నిండటానికి సిగరెట్ల అమ్మకాలను పరోక్షంగా పెంచడం వల్లే చైనాలో ఈ పొగాకు మహమ్మారిని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తం లో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడిసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

మొదటి తరువాయి

ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు. ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

## కంప్యూటర్ బేస్డ్ తరహాలో మళ్లీ 'నీట్-కు సుప్రీం నో !

మొదటి తరువాయి

నీట్-యుజి 2026 పరీక్షను మే 12న దేశవ్యాప్తంగా రద్దు చేశారు. సిబిఐ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టింది. జూన్ 21న తాజా విచారణ జరగాల్సి వుంది. పిటిషనర్ అభ్యర్థనను జస్టిస్ పి.ఎస్.నరసింహా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన బెంచ్ తిరస్కరించింది. జులై వరకు ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది. ఆర్‌జెడి ఎంఎల్‌ఎ సుధాకర్ సింగ్ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించింది. సిబిటి తరహాలో పరీక్ష నిర్వహిస్తే పేపర్ లీక్ అయ్యే సమస్య తలెత్తదని పిటిషనర్ వాదించారు. ఇంత తక్కువ కాల వ్యవధిలో పరీక్షను మళ్లీ నిర్వహించడంలో వుండే ఇబ్బందులను ప్రస్తావిస్తూ, వారికి వుండే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని సిబిటి లాంటి అంశాలను తోసిపుచ్చినట్లు బెంచ్ తెలిపింది. పేపర్ లీకయినప్పటికీ మళ్లీ పెన్ను పేపర్ తరహాలోనే పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారా అని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశ్నించగా, పరీక్షల నిర్వహణా అధికారులు ఎదుర్కొనే రవాణా పరమైన ఇబ్బందులను కూడా బెంచ్ ప్రస్తావించింది. అయినా పిటిషనర్ పట్టుబడుతుండడంతో తక్షణమే ఈ అంశాన్ని విచారించలేమని కోర్టు తెలిపింది. కోర్టు పాక్షిక పని దినాలు ముగిసిన తర్వాత దీనిని విచారణకు పెట్టాలంటూ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల తర్వాత విచారిద్దామని బెంచ్ తెలిపింది. ఎన్‌టిఎ పనితీరులో, పోటీ పరీక్షల నిర్వహణలో విస్తృత సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దాఖలై, పెండింగ్‌లో వున్న పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌ను కూడా కలిపారు.

## ప్రమాదంలో తెలంగాణ అస్తిత్వం

మొదటి తరువాయి

ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని హెచ్చరించారు. ప్రతీప శక్తులనుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని స్పష్టం చేశారు.తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని తెలిపారు. తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోవాలనీ, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కోరారు.

# దేశభక్తి సినిమాలో చూపించడం కాదు..

మొదటి తరువాయి

డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ



ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

మొదటి తరువాయి

ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు.

బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణీకులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.

# పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్

### నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ



హైదరాబాద్

జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు టీఆర్ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ దాడులు

మొదటి తరువాయి

అమెరికా వైమానిక స్థావరం ఉన్న కువైట్‌పై కూడా క్షిపణి, డ్రోన్ దాడులు జరిగాయి. దీంతో ఆ దేశం తన గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలకం చేసింది. ఏప్రిల్‌లో కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య అడపాదడపా పోరు జరుగుతూనే ఉన్న విషయం తెలిసిందే.

**ఎంఓయూలో ట్రంప్ మార్పులు**

మరోవైపు అమెరికా'ఇరాన్ మధ్య అవగాహనా ఒప్పం దం (ఎంఓయూ)పై చర్చలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత ఎంఓయూకు కొన్ని మార్పులు సూచిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానిని తిప్పిపంపారు. మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణను కొనసాగించాలని, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని ఎంఓయూలో ప్రతిపాదించారు. తాజా దాడులను అమెరికా సెంట్రల్ కమాండ్ ధృవీకరించిన తర్వాత ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ 'నిజంగా ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్ అనుకుంటే అది అమెరికాకు, మాతో ఉన్న వారికి మంచి చేసేదిగా ఉండాలి' అని వ్యాఖ్యానించారు. చర్చలపై ప్రతికూల విమర్శలు చేస్తున్న వారిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు హాయిగా కూర్చోండి. విశ్రాంతి తీసుకోండి. చివరికి అంతా మంచే జరుగుతుంది. ఎప్పుడూ అలాగే జరుగుతుంది' అని తెలిపారు. కాగా ఎఎంఓయూలో ట్రంప్ సూచించిన మార్పులేమిటో తెలియరాలేదు. అయితే ఇరాన్ అణు కార్యక్రమం పైన, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం పైన ఆయన కఠిన వైఖరితో ఉన్నారని అధికారులు చెప్పారు. ఒప్పందంలో భాగంగా ఇరాన్‌కు ఎలాంటి ఆర్థిక వెసులుబాట్లు ఇవ్వాలనే విషయంపై కూడా ట్రంప్ ఆలోచిస్తున్నారని వారు తెలిపారు.

# దోమలతో గూగుల్ వినూత్న ప్రయోగం..

మొదటి తరువాయి

రెండేళ్లలో ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో ల్యాబ్‌లో పెరిగిన మగ దోమలను వాతావరణంలోకి రిలీజ్ చేయనున్నారు.దోమల నియంత్రణ కోసం గూగుల్ సంస్థ డీబగ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టును 2014లో ఆవిష్కరించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఆ వినూత్న ప్రాజెక్టును అప్పట్లో ప్రారంభించారు. రసాయనాలు, క్రిమిసంహారకాలపై ఆధారపడకుండా. . సహజసిద్ధమైన బ్యాక్టీరియా వోల్‌బాచియా పిపెంటిస్ ద్వారా ప్రమాదకర దోమలను అంతం చేయాలని భావిస్తున్నారు. మగ దోమలకు ఆ బ్యాక్టీరియాను ఎక్కిస్తారు. ఆ తర్వాత వాటిని అడవుల్లోకి రిలీజ్ చేస్తారు. అయితే ఆడ, మగ దోమలు కలిసిన తర్వాత వచ్చే గుడ్లు ఫలదీకరణ చెందవని గూగుల్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇక పదేపదే ఈ ప్రయోగం చేపట్టడం వల్ల వ్యాధికారక దోమల జనాభాను తగ్గించే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. కేవలం ఆడ దోమలు మాత్రం మనుషులను కుడుతుంటాయి. ఇక అడవుల్లోకి రిలీజ్ చేసిన మగ దోమలు మనుషులను కుట్టవు. అంటే ఈ ప్రయోగం వల్ల దోమల నుంచి సంభవించే అనర్థాలు తక్కువే అని గూగుల్ సంస్థ చెబుతోంది. ఇంతకీ ఈ ప్లాన్ వర్కౌట్ అవుతుందో లేదో చూద్దాం. గూగుల్ సంస్థ సుమారు 3.2 కోట్ల దోమలను ప్రతి ఏడాది రిలీజ్ చేయాలని భావిస్తున్నది. దీని ద్వారా మొత్తం 6.4 కోట్ల దోమలను పర్యావరణంలోకి రిలీజ్ చేస్తారు. పరిశోధనశాల్లో వోల్బాచియా బ్యాక్టీరియా ఎక్కించిన మగదోమలను దశలవారీగా విడుదల చేయనున్నారు. ఒకవేళ ఈ ప్రాజెక్టుకు అప్రూవల్ దక్కితే, అప్పుడు దోమల నియంత్రణ కోసం అమెరికా చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టు ఇదే అవుతుంది. ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం ఈపీఏ పరిశీలన చేస్తున్నది. పబ్లిక్ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోంది. ఇప్పటి వరకు కచ్చితంగా ఏ ప్రదేశంలో ఆ దోమల్ని రిలీజ్ చేస్తారన్న విషయాన్ని వెల్లడించలేదు. గతంలో ఇలాంటి పద్ధతి ద్వారా దోమల నియంత్రణ చేపట్టినట్లు తెలుస్తోంది. వోల్బాచికా బ్యాక్టీరియా విధానాన్ని అనేక దేశాలు అమలు చేసినట్లు తెలుస్తోంది. ఇదే పద్ధతిలో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకుపైగా దోమలను రిలీజ్ చేసినట్లు గూగుల్ సంస్థ చెబుతోంది. ఈ ప్రయోగం వల్ల దోమల జనాభాను తగ్గించారు. వ్యాధికారక దోమలు కూడా తగ్గాయి.ఐ

# ఎల్పీజీ ధరల మోత

మొదటి తరువాయి



హాస్టళ్లు వంటి వాణిజ్య వినియోగదారులు నేరుగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ అదనపు భారం చివరకు వినియోగదారుల పైనే పడే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో పెరిగిన నిత్యావసర ధరలతో ఆర్థికంగా పెను భారాన్ని మోస్తున్న సామాన్యుడికి.. గ్యాస్ ధరల వరుస వడ్డనలు మరింత షాక్ ఇస్తున్నాయి.

# బాల్క సుమన్ అరెస్టు అ ప్రజాస్వామ్యం

● ఖండించిన సర్పంచుల సంఘం అధ్యక్షుడు వద్త్యావత్ శ్రీను నాయక్....



**ఆమనగల్లు,జూన్01(నేటి దర్శిని):** ఆమనగల్లు మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వంపై ప్రశ్నించే గొంతుకులను అక్రమ అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పాలనకు నిదర్శనమని తెలంగాణ ఉద్యమకారులను ప్రశ్నించే గొంతుకులను ఆపలేరని రామ్నుంతల సర్పంచ్ వి శ్రీను నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దమ్ము ధైర్యం ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి అభివృద్ధి చేసి చూపించాలని, రెండున్నర సంవత్సరాలకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని ఇంకా రెండు సంవత్సరాలు అయితే వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాసి పెట్టుకోవాలని ఆయన అన్నారు. రైతులను నమ్మించి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నెంబర్ వన్ స్థానంలో ఉందని మహిళలకు ప్రతినెల 2500 రూపాయలు ఇస్తానని చెప్పి నట్టేట ముంచారని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించాలని ఆయన అన్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని వారన్నారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెట్టకుండా ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని చిల్లర రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల అవగాహన సదస్సు...

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి జగన్....



**ఆమనగల్లు,జూన్01(నేటి దర్శిని);** ఆమనగల్లు పట్టణ కేంద్రంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం రక్షణకై ఉపాధి కూలీల అవగాహన సదస్సును లాలు నాయక్ అధ్యక్షతన నిర్వహించుకున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్ మరియు అధ్యక్షులు పెరుమాండ్ల అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి చివరికి చట్టాన్ని రద్దు చేసే కుట్రలో భాగంగా ఉపాధి హామీ కూలీల పొట్ట గొట్టే విధానంలో రెండుసార్లు ఫోటో దింపే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావడానికి తీవ్రంగా ఖండించారు. రెండు పూటలా ఫోటో తీసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉపాధ్యాయుని చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని,జి రామ్ జి పేరును తొలగించాలని, ఉపాధి హామీ కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, వేసవిలో పనిచేస్తున్న కూలీలకు పని వద్ద మంచినీళ్లు, నీడ సౌకర్యం కల్పించి కూలీలకు వడదెబ్బ తగలకుండా కాపాడుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా కూలీలకు రోజువారి వేతనం 800 చెల్లిస్తూ సంవత్సరానికి కనీసం 200 రోజుల పని దినాలను కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26 వేల జీతం ఇవ్వాలని,ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాలలో సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్ గా తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి తొలగించాలని ప్రయత్నాలు కొనసాగిస్తే ఉపాధి హామీ కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం ఆమనగల్ మండల కమిటీని 12 మంది నీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొప్పు రమేష్ కార్యదర్శిగా లాలూ నాయక్ ను ఎన్నుకున్నారు. సభ్యులుగా రవీందర్ ,పర్వతాలు,విక్రమ్, వెంకటయ్య,నిర్మల చందు,యాదయ్య, కొండల్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తు అంగన్వాడి స్కూళ్లతోనే పునాది..

● 10వ వార్డు కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి..



**ఆమనగల్లు,జూన్01(నేటి దర్శిని);** ఆమనగల్లు మునిసిపాలిటీ పరిధిలోని10 వ వార్డు లో ఉన్న అంగన్వాడి కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోగూరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారం వారి భవిష్యత్తు ఆరోగ్యానికి భరోసానిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థినీ,విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక...

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి...




**ఆమనగల్లు,జూన్01(నేటి దర్శిని);** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు,12వ వార్డు శాంతినగర్ కాలనీలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరిగాయి. ఈ గృహప్రవేశాలకు ముఖ్యఅతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఇందిరమ్మ నూతన గృహాల లబ్ధిదారుల అర్షద్వానాల మధ్య తన స్వహస్తాలతో ప్రారంభించి,లబ్ధిదారులకు ఇంటి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అని,ఇది కేవలం ఇల్లు కాదు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక, ఆమనగల్ పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని ఈ వేదికపై నుంచి మాట ఇస్తున్నాను అని కసిరెడ్డి అన్నారు. ఈ ఇళ్లల్లో లబ్ధిదారులు సుఖసంతోషాలతో, పిల్లాపాపలతో కలకాలం జీవించాలని ఆయన ఆకాంక్షించారు. లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూడడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు రెహనా బేగం,రంగయ్య ఇద్దరికీ ఎమ్మెల్యే ఇంటి పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే గృహప్రవేశాలు చేసిన కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి,కౌన్సిలర్ లు నాగిళ్ల జగన్,మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మానయ్య,సర్పంచ్ రాములు,కేఎన్ఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవ్వారి శివలింగం,కృష్ణా నాయక్ ,కాలే మల్లయ్య, ఐఎన్ టి యుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్,విజయ్,ఎండి అబ్దుల్ రహీం,ఫరీద్, సలీం,శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# వి.ఓ.ఏపై అక్రమ వసూళ్ల ఆరోపణలు

● తొలగించి రికవరీ చేయాలని మహిళా సంఘాల ఫిర్యాదు

**చింతపల్లి, జూన్ 1 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం పి.కె. మల్లేపల్లి గ్రామ వి.ఓ.ఏ గనిపల్లి మాధవిపై శ్రీనిధి, బ్యాంకు రుణాల పేరుతో అక్రమ వసూళ్లు, ఫోర్జరీ సంతకాలు చేసినట్లు ఆరోపిస్తూ గ్రామ మహిళా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమెను తక్షణమే విధుల నుంచి తొలగించి, వసూలు చేసిన సొమ్మును రికవరీ చేసి, కొత్త వి.ఓ.ఏను నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించిన విచారణలో వి.ఓ.ఏపై వచ్చిన ఆరోపణలు నిరూపితమయ్యాయని, దీంతో మహిళా సంఘాల సభ్యులు, లీడర్లు ఏకగ్రీవంగా ఆమెను విధుల నుంచి తొలగించాలని తీర్మానించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలపై పలు ఆరోపణలు శ్రీనిధి రుణాలు పూర్తిగా చెల్లించినప్పటికీ సభ్యుల వద్ద నుంచి అదనంగా రూ.5 వేలకుపైగా వసూలు చేసినట్లు ఆరోపణ. రుణాల మంజూరుకు లక్ష రూపాయలకు రూ.1,000 నుంచి రూ.5,000 వరకు కమిషన్ తీసుకున్నట్లు ఆరోపణలు. బ్యాంకు రుణాల కోసం ఒక్కో సంఘం నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసినట్లు సభ్యులు తెలిపారు. నాలుగేళ్ల క్రితం మరణించిన సభ్యురాలి పేరుతో రుణాలు తీసుకొని, కొత్త సభ్యుల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపించారు. జైశ్రీరామ్ సంఘ సభ్యుల నుంచి రూ.5,500 వసూలు చేసి రశీదు ఇవ్వకపోవడంతో పాటు ఎటువంటి ఖాతాలోనూ జమ చేయలేదని పేర్కొన్నారు. వరలక్ష్మి సంఘంలో సంఘ తీర్మానం లేకుండానే శ్రీనిధి రుణం తీసుకున్నట్లు ఆరోపించారు. సంఘ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలి సంతకాలను ఫోర్జరీ చేసి నగదు బదిలీలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు, లీడర్లతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అధికారుల స్పందనపై అసంతృప్తి డి.ఎం.జి, సి.సి, ఎ.పి.ఎం తదితర అధికారుల సమక్షంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ నెల 23న ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు వి.ఓ.ఏ వద్ద ఉన్న రికార్డులు, రిజిస్టర్లు స్వాధీనం చేసుకోలేదని వాపోయారు. ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఆమె మండల స్థాయి సమావేశాలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆరోపణలు రుజువైనందున గనిపల్లి మాధవిని వి.ఓ.ఏ విధుల నుంచి తొలగించి, అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని రికవరీ చేసి, ఆమె స్థానంలో కొత్త వి.ఓ.ఏను నియమించాలని మహిళా సంఘాల సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.



# సంపాదకీయం

## తెలంగాణ మేధావులు ఆలోచించాలి !




తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్‌ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

## ఇక టీవీకే, డీఎంకే మధ్యనే పోరు..
# అన్నాడీఎంకేకు చోటుండదు


**- తమిళనాడు సీఎం విజయ్**



న్యూఢిల్లీ జూన్ 1 (నేటి దర్శిని)
తమిళనాడు లో రాజకీయ పోరు ఇకపై టీవీకే, డీఎంకే మధ్య మాత్రమేనని, అన్నాడీఎంకే కు చోటుండదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత సోమవారం తొలిసారిగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని వ్యాఖ్యానించారు. తన పాలన ప్రజలందరి కోసం ఉంటుందని, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని అన్నారు.రాజకీయంగా చెబుతున్నా. ఇప్పుడు పోటీ కేవలం రెండు పార్టీల మధ్యే. ఒకటి డీఎంకే, మరొకటి టీవీకే. మధ్యలో ఇంకెవరికీ పాత్ర లేదు' అని విజయ్ చెప్పారు. తమ పార్టీపై వస్తున్న హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండించిన విజయ్.. అధికారం కోల్పోయిన డీఎంకే, అన్నాడీఎంకేలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'ఇన్నేళ్లుగా మిమ్మల్ని మోసం చేస్తున్న వారిని కాదని, మీ కోసం పనిచేయడానికి వచ్చిన మీ విజయ్‌ని, మీ అన్నని, మీ తమ్ముడిని ముఖ్యమంత్రిగా కాదు, మీ మొదటి సేవకుడిగా ఎన్నుకున్నారు' అని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చి కొద్ది వారాలే అయినా.. ఆరు నెలలు మౌనంగా ఉంటామని చెప్పిన వాళ్లు ఆరు రోజులు కూడా ఆగలేకపోయారని విమర్శించారు. చివరగా తాను సూట్ ధరించడంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. సూట్ ఎందుకు వేసుకోకూడదని విజయ్ ప్రశ్నించారు.

# తమిళనాడులో మరో కొత్త పార్టీ?

**- బీజేపీ నేత అన్నామలై పోస్టర్లపై చర్చ**




న్యూఢిల్లీ జూన్ 1 (నేటి దర్శిని)
తమిళనాడులో మరో కొత్త పార్టీ ఆవిర్భవించనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు చర్చ జరుగుతున్నది. 'నిర్భయ మనస్సులకు పరిమితులు ఉండవు' అన్న పేరుతో కోయంబత్తూరు అంతటా ఆయన పోస్టర్లు వెలిశాయి. రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాన్ని కోయంబత్తూరులో బీజేపీ నిర్వహిస్తున్న సమయంలోనే ఈ పరిణామం జరుగడం విశేషం.కాగా, అన్నామలై కొంతకాలంగా బీజేపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పటి వరకు రెండు రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశాలకు ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో అన్నామలై అభిమాన సంక్షేమ సంఘమైన 'అన్నామలై అన్బు కూట్టం' కొత్త పార్టీ ఊహాగానాలకు తెరతీసింది. కొత్త సభ్యులను, కార్యవర్గ సభ్యులను చేర్చుకుంటున్నట్లు ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. అలాగే బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను ఢిల్లీలో అన్నామలై కలిసి ఆ పార్టీకి ఆయన రాజీనామా చేయనున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం చేసిన ఒక ట్వీట్ ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. 'తమిళనాడులో మరో రాజకీయ పార్టీ రాబోతోంది. మార్పులు వేగవంతమవుతున్నాయి. (ఎంఎస్ -- ప్రతిపాదిత పేరులో ఒక ఆసక్తికరమైన తర్కం ఉన్నది)' అని ఆయన ట్వీట్ చేశారు.


## జమ్ముకశ్మీర్‌లో గడిచిన మూడు
# దశాబ్దాల్లో 'ఉగ్ర' మరణంలేని నెల ఇదే..!



న్యూఢిల్లీ జూన్ 1 (నేటి దర్శిని)
జమ్ముకశ్మీర్ భద్రతా చరిత్రలో ఒక చారిత్రక మైలురాయి నమోదైంది. గడిచిన మూడు దశాబ్దాలకుపైగా కాలంలో తొలిసారిగా, ఉగ్రవాద సంబంధిత హింసలో ఒక్క మరణం కూడా నమోదు కాకుండా ఒక నెల గడిచింది. జమ్ముకశ్మీర్‌లో భద్రతా పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. సౌత్ ఏషియా టెర్రరిజం పోర్టల్ వంటి స్వతంత్ర ట్రాకర్లతోపాటు అధికారిక గణాంకాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.జాతీయ మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికల ప్రకారం.. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే సంభవించాయి. అందులో 10 మంది ఉగ్రవాదులు, ఒక భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ కాలంలో ఒక్క సామాన్యుడు కూడా ప్రాణాలు కోల్పోలేదు. గతంతో పోలిస్తే ఇది చాలా మెరుగైన పరిస్థితి. ఇక ఈ మే నెలలో ఎలాంటి ఉగ్రవాద సంబంధ మరణం చోటుచేసుకోలేదు. ఉదాహరణకు 2001 మే నెలలో దాదాపు 300 మంది, 2025 మే నెలలో 43 మంది ప్రాణాలు కోల్పోయారు. భద్రతా బలగాలు నిరంతరాయంగా చేపడుతున్న కౌంటర్-టెర్రరిజం ఆపరేషన్లు, నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడం, ఉగ్రవాదులకు స్థానిక మద్దతు తగ్గడం వంటి కారణాలవల్లే ఈ మార్పు సాధ్యమైందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడి తర్వాత భద్రతను కట్టుదిట్టం చేసి, ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉగ్ర మరణాలులేని నెలగా 2026 మే నిలవడం శాంతి, స్థిరత్వం దిశగా ఒక సానుకూల సంకేతమని నిపుణులు భావిస్తున్నారు.

## ఢిల్లీకి కాక్రోచ్ జనతా
# పార్టీ వ్యవస్థాపకుడు..

**-జూన్ 6న నిరసన ప్రదర్శన**




న్యూఢిల్లీ జూన్ 1 (నేటి దర్శిని)
కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జూన్ 6వ తేదీన ఇండియా రానున్నాడు. ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాల అంశంలో నైతిక బాధ్యత తీసుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిర్వహించే శాంతియుత ప్రదర్శనలో ఆయన పాల్గొననున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీప్కే ఓ వీడియో రిలీజ్ చేశాడు. ఢిల్లీలో జరిగే ఆ నిరసన కార్యక్రమంలో మద్దతుదారులు, విద్యార్థులు పాల్గొవాలని పిలుపు ఇచ్చారు. అందరం దగ్గరకు రావాల్సిన సమయం ఆసన్నమైందని, భారత రాజ్యాంగం అడుగుజాడల్లో.. మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా డిమాండ్ కోరుదామన్నాడు. మనం మన గళం విప్పితే, దానికి వాళ్లు తప్పకుండా వింటారన్నారు.జూన్ 6వ తేదీన తన మద్దతుదారులందరూ విమానాశ్రయానికి చేరుకోవాలని తన వీడియో మెసేజ్‌లో పిలుపునిచ్చారు. జూన్ 6, శనివారం ఉదయం నేను ఢిల్లీకి చేరుకుంటానని, అందరూ విమానాశ్రయానికి రావాలని, కలిసికట్టుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్దామని దీప్కే అన్నాడు. జంతర్ మంతర్‌లో శాంతియుత ప్రదర్శన కోసం పర్మిషన్ అడుగుదామన్నాడు. నీటి, సీబీఎస్ఈ లాంటి పరీక్షల సంబంధిత వివాదాల వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని దీప్కే అన్నారు. సోషల్ మీడియా ఆధారంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పడిన విషయం తెలిసిందే. ఆ పార్టీని సబ్‌స్క్రైబ్ చేస్తున్న వారి సంఖ్య కూడా కోట్లకు చేరుకున్నది.



## ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు

● మహబూబ్ నగర్‌జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్



**మిడ్జిల్, జూన్ 01, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. కుటుంబ వివాదాలు, భూ సమస్యలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు మరియు ఇతర అంశాలకు సంబంధించిన పలువురు బాధితుల వినతులను ఓర్పుతో విని సంబంధిత పోలీస్ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడం పోలీసు శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా విచారించి చట్టపరమైన చర్యల ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి అధికారి ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ స్పందనాత్మకంగా పనిచేయాలని సూచించారు. అలాగే మహిళలు, వృద్ధులు మరియు సైబర్ మోసాలకు గురైన బాధితుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

## అనారోగ్య సమస్యలు తట్టుకోలేక రైతు ఆత్మహత్య



**గుర్రంపోడు, జూన్ 01(నేటి దర్శిని):** రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ యువ రైతు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన గుర్రంపోడు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొప్పోలు గ్రామానికి చెందిన కన్నెబోయిన సైదులు (35), బిక్షమయ్య కుమారుడు, వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత రెండు సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సైదులు మానసికంగా తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన సైదులు, బెండ తోట కోసం ఉంచిన పురుగుల మందును సేవించాడు. అనంతరం సాయంత్రం ఇంటికి చేరుకున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి మరింత విషమించడంతో సోమవారం ఉదయం 11:40 గంటలకు సైదులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య కన్నెబోయిన పద్మ ఉన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రంపోడు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి శవపరీక్ష నిర్వహించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# అనుముల మండలంలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు







● రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి



**అనుముల, జూన్ 1 (నేటి దర్శిని):** నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని అనుముల మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చింతగూడెం, రామడుగు, కుప్పాస్పల్లి, మారేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరెడ్డి కోటిరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. చింతగూడెం గ్రామంలో లబ్ధిదారులు చదరవల్లి రామలింగయ్య, పల్లపు నవీన్, కట్నం రాజేశ్వరి, కాకునూరి జయమ్మల నూతన గృహాల్లో గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రామడుగు గ్రామంలో సర్పంచ్ మజ్జిగపు నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి సమక్షంలో లబ్ధిదారులు సైదయ్య-నాగమణి, మెండే రాజు యాదవ్‌ల నూతన గృహాలను ప్రారంభించారు. కొబ్బరికాయలు కొట్టి శుభారంభం చేశారు. కుప్పాస్పల్లి గ్రామంలో బొడ్డు రాములు నూతన గృహాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పేర్ల బాలు, విక్రం, విజేందర్, వార్డు సభ్యులు మంగమ్మ, నరసింహ, వెంకటయ్య, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు. మారేపల్లి గ్రామంలో సర్పంచ్ వడ్డేగోని సరస్వతి-లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి పి. వెంకన్న, గ్రామ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో లబ్ధిదారులు బోసు చంద్రయ్య, ఎస్కే బషీర్, రేబల్లి అంజయ్య, అనుముల రాజేశ్వరి గృహాలను ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయలు కొట్టి గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



**మహేశ్వరం, జూన్ 1 (నేటి దర్శిని):** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) ఆదివారం మహేశ్వరం, సుభాన్‌పూర్, మాణిక్యమ్మగూడ, చిన్నతూర్ప గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు గూడు, కూడు కల్పించే సంక్షేమ పాలనను కాంగ్రెస్ పార్టీ నాటి నుంచి నేటి వరకు కొనసాగిస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా సన్నబియ్యం పంపిణీ చేపట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వానికి దక్కిన ఘనత అని అన్నారు. గత పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా నిర్మించని బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు. కేఎల్‌ఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో కాన్వాయ్‌లో పాల్గొని ఉత్సాహం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపేటలో ఆర్యవైశ్య సంఘం నూతన కళ్యాణ మండపం ఘనంగా ప్రారంభం





**కొత్తపేట, జూన్01 (నేటి దర్శిని):** కొత్తపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న మహంకాళి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని సోమవారం అతిరథ మహారథుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, చండీ ఉపాసకులు పాలెం మనోహర శర్మ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్త, ఆలయ చైర్మన్ వజీర్ ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజ సేవలో ఎప్పుడూ ముందుంటారని, తాము సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని పేదల సంక్షేమానికి వెచ్చించడం వారి ప్రత్యేకత అని పేర్కొన్నారు. నిరుపేదల కోసం తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే విధంగా కళ్యాణ మండపాన్ని నిర్మించడం అభినందనీయమని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు చైర్మన్ ఎల్.వి. కుమార్, కన్వీనర్ మంచుకొండ సురేందర్ గుప్త మాట్లాడుతూ కొత్తపేట, చైతన్యపురి పరిసర ప్రాంతాల్లోని పేద కుటుంబాలు తమ శుభకార్యాలను ఈ కళ్యాణ మండపంలో అత్యల్ప వ్యయంతో నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సంఘం అధ్యక్షులు మాదూరు వాసు గుప్త మాట్లాడుతూ కళ్యాణ మండప నిర్మాణానికి సహకరించిన ఆలయ చైర్మన్ వజీర్ ప్రకాష్ గౌడ్‌తో పాటు దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించి వాసవి మాత లాకెట్లను అందజేశారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు కోలేటి దామోదర్, చీకటిమల్ల అశోక్ కుమార్, మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్త, మాజీ కార్పొరేటర్లు రంగా నర్సింహా గుప్త, పవన్ కుమార్, రాధా ధీరజ్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు వజీర్ జైహింద్ గౌడ్, బొగ్గారపు వెంకటేశ్వర్లు, అమరనాథ్, వెలుగందుల ఆంజనేయులు, చీకోటి కరుణాకర్, చంద్రకాంత్, చీకోటి విజయకుమార్, ఉప్పల బాలశ్యామ్, కర్నాటి శ్రీనివాస్, కోటగిరి నాగభూషణం, కొత్తూరు శ్రీనివాస్, జూలూరి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన అతిథులు, దాతలు, చీఫ్ అడ్వైజర్లు, అడ్వైజర్లు, సంఘ సభ్యులకు ప్రధాన కార్యదర్శి అత్తెం సత్తయ్య, కోశాధికారి వీరలింగం, అన్నప్రసాద ప్రాజెక్టు చైర్మన్ రేణికుంట శ్రీనివాస్ గుప్త, కో-కన్వీనర్ అర్వపల్లి శ్రీనివాస్ గుప్త కృతజ్ఞతలు తెలిపారు.




# గుర్రంపోడులో శ్రీ హనుమాన్ వాషింగ్ సెంటర్ ప్రారంభం



**గుర్రంపోడు, జూన్ 01(నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ హనుమాన్ వాషింగ్ సెంటర్ ను సోమవారం గుర్రంపోడు మండల కాంగ్రెస్ నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, తగుళ్ల సర్వయ్య,గాలి రవి కుమార్ గౌడ్, చనమల్ల జగదీశ్వర్ రెడ్డి, సూదిని జగదీశ్వర్ రెడ్డి, జాల చిన్న సత్తయ్య, కుప్ప అమరేందర్ గౌడ్, చనమల్ల యాదవ రెడ్డి, కమతం జగదీశ్ రెడ్డి, మేడి వెంకన్న,కుప్ప ఎల్లేష్, మండలి లింగయ్య, సర్పంచులు మోహన్ నాయక్, వసంత రాజశేఖర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాషింగ్ సెంటర్ నిర్వాహకులు బెజవాడ నరేష్ మాట్లాడుతూ.. తమ వద్ద అన్ని రకముల ఫోర్ వీలర్, టూ వీలర్ వాహనాలకు వాషింగ్ సర్వీస్ చేయబడునని ఈ అవకాశాన్ని మండలంలోని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 15వ ఫైనాన్స్ నిధుల దుర్వినియోగం పై ఎంపీ ఓ. ఇందుజ స్పందన

- నేటి దర్శిని దినపత్రికలో వెలువడిన కథనానికి స్పందించిన ఎంపీ ఓ



**చింతపల్లి, జూన్01 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని ఘడియ గౌరారం గ్రామపంచాయతీలో 15వ ఫైనాన్స్ నిధుల దుర్వినియోగం పై నేటి దర్శిని దినపత్రికలో వెలువడిన వార్తలకు ఎంపీ ఓ. ఇందుజ స్పందించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు సంబంధిత అంశాలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో 15వ ఫైనాన్స్ నిధుల వ్యయానికి సంబంధించిన రికార్డులు, తీర్మానాలు, పనుల వివరాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. నిధుల వినియోగం ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే జరిగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు వెల్లడించారు. అయితే ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించడం తమ బాధ్యత అని పేర్కొన్న ఆమె, ఎక్కడైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రజలు అపోహలకు గురికాకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే స్పందించాలని ఎంపీ ఓ. ఇందుజ కోరారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

# ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- జర్నలిస్టులను ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీంలో చేర్చాలి..
- వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి..
- ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలో ఫీజు రాయితీ కల్పించాలి..
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య
- రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం







**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్01(నేటి దర్శిని):** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచి పరిణామని, అదే క్రమంలో ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు కూడా సేకరించి ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య ప్రభూత్వాన్ని కోరారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం అబ్దులాపూర్ మెట్ మండల కేంద్రంలోని వి. వి బ్యాంకెట్‌హాలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య, జిల్లా అధ్యక్ష?ులు శేరిబాయి గణేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు, కోశాధికారి శ్రీనివాస్ చారి, నేషనల్ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష?ులు గణేష్ అధ్యక్ష?త వహించారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ జర్నలిస్టుల విషయంలో ఎలాంటి కొర్రిలు పెట్టకుండా కార్డులు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారుల హెల్త్ స్కీం జాబితాలో జర్నలిస్టులను చేర్చాలన్నారు. ఇండ్ల జాగాల విషయంలో హైదరాబాద్ కేంద్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇచ్చేందుకు చేస్తున్న ఆలోచనలో భాగంగా ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా జర్నలిస్టుల వివరాలు సేకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరల్నిస్టుల పిల్లల ఫీజు రాయితీ విషయంలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ఖచ్చితంగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో రాయితీ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు, డీఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేశ్, మణికుమార్ , రఘునంధన్ గౌడ్, సుధర్శన్ గౌడ్, శ్రీనివాస్ , నర్సింహ్మ, రాజశేఖర్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యాదగిరి, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ పులిపలుపుల శివ కుమార్ గౌడ్ , జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్ష?, కార్యదర్శులు యాదగిరి, రఘవేందర్ గౌడ్, రాజు, జైచందర్ , శంకర్, బుచ్చయ్య, జర్నలిస్టులు మల్లేష్, యాకుబ్ పాష, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అమరవీరులకు జోహార్లు

- తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన మిడ్జిల్ కోపరేట్ బ్యాంక్ చైర్మన్ కూచూరు శ్రీనివాసరెడ్డి





**పద్మక్రాంతి, జూన్ 01, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల కోపరేట్ బ్యాంక్ చైర్మన్ కూచూరు శ్రీనివాస్ రెడ్డి నేటి దర్శిని ప్రతినిధితో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ నాడు ఒక్కడే కేసీఆర్ మన నీళ్లు, నిధులు,నియామకాలు మనగ్గావాలని ఎన్నో పదవులను త్యాగం చేసి ఉద్యమ బాట పట్టి సకలజనులని ఏకం కేసీఆర్ చచ్చుడో..తెలంగాణ ఒచ్చుడో..అని నిరాహార దీక్ష చేపట్టి ఢిల్లీ మెడలు ఒంచి తెలంగాణ రాష్ట్రన్ని సాధించిన ఘనత బాపు కేసిఆర్ కె దక్కుతుందని ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని కొనియాడారు ,మల్లి రాబోయేది మన ప్రభుత్వమేనని బంగారు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములమవ్వాలని కోరారు



# గరికినట్టు తండాలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

**తిరుమలగిరి సాగర్, జూన్1 (నేటి దర్శిని):** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి సాగర్ మండల పరిధిలోని గరికినట్టు తండా గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు ఇండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పెద్దలు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, నల్గొండ జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ గడ్డం సాగర్ రెడ్డి, కొంపెల్లి గ్రామ సర్పంచ్ జంగాల రవీందర్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, అధిక సంఖ్యలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ





- ప్రజా సమస్యల పరిష్కారం, నాణ్యమైన దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఎన్‌హెచ్-44పై ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- నిష్పక్షపాత విధులతో ప్రజల విశ్వాసం పెంపొందించాలి
- హెల్మెట్ ధరించడం తప్పనిసరి... పోలీసులే ప్రజలకు ఆదర్శం కావాలి

**మిడ్జిల్, జూన్ 01, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న ఎఫ్ఐఆర్ నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను



సమగ్రంగా పరిశీలించారు. ప్రతి కేసును సమయానుకూలంగా నమోదు చేసి సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి దశలో పారదర్శకత మరియు జవాబుదారీతనం పాటించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ ఆదేశాలను సిబ్బందికి వివరిస్తూ, నిష్పక్షపాత విధులే పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. ముఖ్యంగా నేషనల్ హైవే-44పై అధిక ట్రాఫిక్ రద్దీ నెలకొంటున్న నేపథ్యంలో, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పర్యవేక్షణ, అవసరమైన చోట ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలను కూడా పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదగా పలకరిస్తూ, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం తగ్గుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులే ప్రజలకు ఆదర్శంగా ఉండాలని పేర్కొంటూ, హెల్మెట్ లేకుండా వచ్చే సిబ్బందిని పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ, వారి విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలు మరియు వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న సిబ్బంది ప్రతి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేరుగా తనను కలవవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ కమలాకర్, ఎస్ఐలు జయప్రసాద్, ఖాదర్, అక్షయదీప్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పార్థివ దేహానికి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి



**హాలియా, జూన్01 (నేటి దర్శిని):**
హాలియా మున్సిపాలిటీ 6వ వార్డుకు చెందిన కొమ్మిరె ఇద్దమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి సోమవారం వారి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసురాజు, కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు, మహమ్మద్ మజహర్, పోలే నాగరాజు, తన్నీరు పుల్లయ్య, పల్లేటి ఈదయ్య, గ్రామ పెద్దలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

# మిడ్జిల్ ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు


- బిఆర్ఎస్ నాయకులు గంజి కృష్ణ



**మిడ్జిల్ జూన్ 01( నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ బిఆర్ఎస్ నాయకులు గంజి కృష్ణ మాట్లాడుతూ.. మిడ్జిల్ మండల ప్రజలందరికీ జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం భాగస్వాములైన ఉద్యమకారులకు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నవతరం ఉ యువతరానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీఐ కింద సమాచారం నిరాకరణ..

- ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ కార్యాలయంపై విమర్శలు
- పాఠశాల వివరాలు కోరిన సామాజికవేత్తకు 'సమాచారం ఇవ్వలేము' అంటూ సమాధానం
- ఆర్టీఐ చట్టంలోని మినహాయింపు నిబంధనలు పేర్కొనకపోవడంపై అభ్యంతరాలు
- వ్యవహారంపై ఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న ప్రజలు



OGOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF SCHOOL EDUCATION

From
The Public Information Officer,
O/o the Deputy Educational Officer,
Musheerabad Zone, Hyderabad

To
Sri.Anil Kumar,
H.No.1-6-174/A/2/F, Bapujinagar,
Musheerabad, Hyderabad – 500020,
Ph.No.9441258234.

Lr.No. /RTI/2026, Dt. 6 -04-2026

Sir,

Sub: RTI Act-2005 – Application received from Sri.Anil Kumar, H.No.1-6-174/A/2/F, Bapujinagar, Musheerabad, Hyderabad – 500020, Ph.No.9441258234– Seeking information towards Blooming Buds High School, Musheerabad, Hyderabad -Providing of Information under R.T.I. Act-2005 – Reg.

Ref: 1.Lr.No.138/D1/RTI/2026, Dt.06-04-2026, from the D.E.O., Hyd.
2.Lr.Dt.20-03-2026, from the Sri.Anil Kumar, H.No.1-6-174/A/2/F, Bapujinagar, Musheerabad, Hyderabad.

&&&

I am to inform you that, an application has been received from Sri.Anil Kumar, H.No.1-6-174/A/2/F, Bapujinagar, Musheerabad, Hyderabad – 500020, Ph.No.9441258234 through Public information Officer, O/o the District Educational Officer, Hyderabad District vide reference 1st and 2nd cited, wherein an applicant seeking certain information towards Blooming Buds High School, Musheerabad, Hyderabad.

Further the applicant is informed the following:

| Sl.No. | Seeking Information | Particulars of Information |
| --- | --- | --- |
| 1 | The applicant seeking certain Information towards Blooming Buds High School, Musheerabad, Hyderabad. | The applicant is informed that, it is not feasible to provide information in terms of section (2) read with sub-section (2), (3) & (4) of Right to Information Act-2005. |

Sri.Anil Kumar, H.No.1-6-174/A/2/F, Bapujinagar, Musheerabad, Hyderabad – 500020, Ph.No.9441258234 is informed that, an application received under Right to Information Act-2005 has been considered and disposed accordingly.

Yours faithfully,

Public Information Officer,
O/o the Deputy Educational Officer,
Musheerabad Zone, Hyderabad.




**హైదరాబాద్, జూన్ 1 (నేటి దర్శిని):**
సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)--2005 అమలుపై ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ కార్యాలయం వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఓ సామాజికవేత్త ఆర్టీఐ చట్టం కింద ఒక పాఠశాలకు సంబంధించిన వివరాలను కోరగా, పూర్తి సమాచారం అందించలేమంటూ డిప్యూటీ డీఈఓ కార్యాలయం నుంచి రాతపూర్వక సమాధానం ఇవ్వడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ప్రజలకు సమాచార హక్కును కల్పించేందుకు రూపొందించిన ఆర్టీఐ చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని చట్టబద్ధంగా అందించాల్సి ఉంటుంది. అయితే, కోరిన సమాచారాన్ని నిరాకరిస్తూ ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ లక్ష్మణ్ సింగ్ కార్యాలయం నుంచి జారీ చేసిన సమాధానంలో, సమాచారం ఎందుకు ఇవ్వలేమనే విషయాన్ని స్పష్టంగా పేర్కొనలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీఐ చట్టం ప్రకారం సమాచారం నిరాకరించాలంటే, చట్టంలోని సెక్షన్--8 లేదా ఇతర మినహాయింపు నిబంధనలను స్పష్టంగా ప్రస్తావించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. కానీ సంబంధిత కార్యాలయం నుంచి కేవలం సమాచారం వెల్లడించలేమంటూ ముద్రిత పత్రం ఇవ్వడం పారదర్శకత, జవాబుదారీతనం అంశాలపై అనుమానాలకు దారితీస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆర్టీఐ చట్టంలోని సెక్షన్--4 ప్రకారం విద్యాసంస్థల పరిపాలన, విధులు, అధికారుల బాధ్యతలు, నిర్వహణకు సంబంధించిన అనేక వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో పాఠశాలకు సంబంధించిన సమాచారం ఎందుకు ఇవ్వలేమన్న అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, ఆర్టీఐ నిబంధనల అమలుపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ కార్యాలయం స్పందన తెలియాల్సి ఉంది.

# లాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- పేదల సొంతింటి కల సాకారం




**ఎలిగేడు, జూన్ 1 (నేటి దర్శిని):**
లాలపల్లి గ్రామంలో నిర్మించిన 13 ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో భాస్కరరావు, సర్పంచ్ వెంకటరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ, "ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి సొంతింటి కలను నిజం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, "అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతోంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచులు చిగుర్ల క్రాంతి కుమార్, బాసంపల్లి కొండయ్య, వార్డు సభ్యులు ఎండి అఫ్రోజు, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పెద్ది తిరుపతి, ముత్కల అనిల్, మీనుగు మల్లేశం, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు విస్తృత చర్యలు

- తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరిక

**నంద్యాల, జూన్ 1 (నేటి దర్శిని):**
నంద్యాల జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణే ప్రధాన ధ్యేయంగా, మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ముఖ్య కూడళ్లలో విద్యార్థులకు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలపై చైతన్యం కల్పించినట్లు ఆయన వివరించారు. 2026 జనవరి నుండి మే 31 వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లలో 312 మైనర్ డ్రైవర్లను




గుర్తించి, రూ.15,70,920 జరిమానా విధించామని, వారితో పాటు తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ నిర్వహించామని ఎస్పీ వెల్లడించారు. "మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. ఇది వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయకూడదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. నంద్యాల జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలందరూ, ముఖ్యంగా తల్లిదండ్రులు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు మరింత తీవ్రతరం చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.


# ఆర్థిక సవాళ్ల మధ్య పెన్షన్ల పంపిణీ

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు జూన్ 1 (నేటి దర్శిని):**
రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్ల మధ్య కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేస్తున్నామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీ 8వ వార్డులో కూటమి నాయకులతో కలిసి పెన్షనర్లతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తోంది" అని అన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4,000 పింఛన్ అందజేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని, వికలాంగులకు వివిధ కేటగిరీల్లో రూ.6,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్లు అందజేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# పెద్దిలో స్పోర్ట్స్‌కే ప్రాధాన్యం




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని విడుదల దగ్గర పడుతుండడడంతో సోషల్ మీడియాలో రోజుకో వార్త వైరల్ అవుతోంది. 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లోని సూపర్ హిట్ సాంగ్ 'అబ్బనీ తియ్యనీ దెబ్బ'ను ఇందులో రీక్రియేట్ చేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రామ్ చరణ్ దీనిపై స్పందించారు. మీరు కొన్ని విషయాలు బిగ్‌స్క్రీన్ మీద చూసి తెలుసుకోవాలి. మేం ఆ పాటను రీక్రియేట్ చేయలేదు. కథకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. అలాంటివి అన్నీ యాడ్ చేస్తే ఇది మరీ కమర్షియల్ సినిమా అవుతుంది. అది ఐకానిక్ సాంగ్' అని చరణ్ అన్నారు. ఇక 'పెద్ది' గురించి మాట్లాడుతూ.. 'క్రీడలపై పూర్తి ఫోకస్‌తో ఉంటూ వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే వాళ్లు దీన్ని కచ్చితంగా చూడాలి. థియేటర్ నుంచి భావోద్వేగంతో బయటకు వస్తారు. వీక్ మైండ్ ఉన్నవాళ్లు కూడా చాలా స్ట్రాంగా ఆలోచించడం ప్రారంభిస్తారు. జీవితంలో అత్యంత కష్టమైన సమయాలను ఎలా ఎదుర్కోవాలో అనేదానిపై స్పష్టమైన ఆలోచన వస్తుంది. మనకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా జీవితం ముందుకు సాగిపోవాలి అని 'పెద్ది' మనకు నేర్పుతాడు. ఈ జనరేషన్ కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయమిదని రామ్ చరణ్ తెలిపారు. ఇక, తండ్రి చిరంజీవిని చూసి ఎంతో స్ఫూర్తి పొందానని రామ్ చరణ్ చెప్పారు. ఆయన లేకపోతే తన జీవితమే లేదన్నారు. బాబాయ్ పవన్ కల్యాణ్‌ను చూసి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు.

# శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

## నగరంలోని విమల్ థియేటర్ వద్ద కొంత షూట్ కోసం యత్నాలు




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'స్పిరిట్' ఒకటి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రల్లో ఒకటిగా భావిస్తున్న ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కావడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సినిమా తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ థియేటర్ ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్‌కు వేదికగా మారింది. ఈ ప్రత్యేక షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ కూడా ఈ షూట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఆయన థియేటర్‌కు రానున్నారనే వార్త బయటకు రావడంతో అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుంటున్నారు. షూటింగ్ ప్రదేశం చుట్టూ అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో జనసందోహాన్ని నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 'స్పిరిట్' చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, క్రైమ్ డ్రామా అంశాల కలయికతో ఈ కథ రూపొందుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి నటిస్తోంది. 'యానిమల్' తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆమె నటిస్తున్న మరో చిత్రం కావడం విశేషం. మరోవైపు ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇది ఆయనకు టాలీవుడ్‌లో పూర్తి స్థాయి తొలి భారీ ప్రాజెక్ట్‌గా చెప్పకోవచ్చు. అలాగే కాంచన, ఐశ్వర్య దేశాయ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.

# అరసన్‌లో ప్రియాంక అరుల్ మోహన్



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ.. దక్షిణాది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది అందాల తార ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ'తో అలరించిన ఈమె.. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'తో ప్రశంసలు దక్కించుకుంది. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హీరో శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక మోహన్‌ను ఎంపిక చేసే పనిలో పడిందట చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుందని ప్రియాంక సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'తో పాటు కవిన్ సరసన మరో చిత్రంలో నాయికగా బిజీగా ఉంది.


# పొలాచ్చిలో చిరు మూవీ షూటింగ్



కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## అప్పుడే మరో సినిమా..

# గోపీచంద్ 34 షూటింగ్ షురూ.. !




టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ ప్రస్తుతం 'భరత వర్ష : సాగా ఆఫ్ శూల' సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. సంకల్ప్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ మూవీ సెట్స్‌పై ఉండగానే గోపీచంద్ 34గా రాబోతున్న మరో సినిమాను కూడా లాంచ్ చేశాడు. పాపులర్ స్టంట్ మాస్టర్ వీ వెంకట్ ఈ సినిమాతో డెరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి నెలకొంది. మేలో లాంచ్ అయిన ఈ సినిమా షూటింగ్ ఫైనల్‌గా నేడు షురూ అయింది. ఈ చిత్రంలో అనార్కలి నాజర్ ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి రీసెంట్‌గా విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేస్తుంది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామాగా సినిమా ఉండబోతుందని స్పష్టమవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365